## అరూరి గెలుపు కోసం కృషి చేయాలి

హసన్‌పర్తి, అక్టోబర్ 28 : ఎమ్మెల్యే అరూరి రమేశ్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజినీకుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హసన్‌పర్తిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ అరూరిని మూడోసారి భారీ మెజారిటీతో గెలిపించడం కోసం పార్టీ శ్రేణులు కంకణబద్ధులై పనిచేయాలని సూచించారు. ప్యాక్స్ చైర్మన్ జక్కు రమేశ్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెసరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సుభాశ్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు ఆళ్ల రవీందర్, యూత్ మండలాధ్యక్షుడు మేక భగవాన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు చిర్ర తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు రజనీకుమార్

## బెటాలియన్‌లో రక్తదాన శిబిరం

కరీమాబాద్, అక్టోబర్ 28 : పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం మామునూరులోని 4వ బెటాలియన్‌లో కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. అసిస్టెంట్ కమాండెంట్లు జయరాం, రాంబాబు, 4, 5వ బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న బెటాలియన్ సిబ్బంది

## భక్తిశ్రద్ధలతో ఖాదర్ ఉత్సవాలు

పర్వతగిరి, అక్టోబర్ 28 : మండలంలోని తురకల సోమారం గ్రామంలో శనివారం ఖాదర్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు షేక్ రబ్బానీ బాబా మాట్లాడుతూ ఉత్సవాలను తిలకించేందుకు కులమతాలకు అతీతంగా ప్రజలు తరలివస్తారని చెప్పారు. హజ్రత్ మషూక్ ఏ రబ్బానీ చిల్లా వద్ద గ్యారమీ ఉత్సవాలను చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో మహ్మద్‌అలీ, బీఆర్ఎస్ నాయకులు రాపాక నాగయ్య, శ్రీనివాస్, షమీర్‌పాషా పాల్గొన్నారు.



ఖాదర్ ఉత్సవాల్లో పాల్గొన్న మతపెద్దలు

## రూ.2.38లక్షల నగదు పట్టివేత

కరీమాబాద్, అక్టోబర్ 28: ఎన్నికల నేపథ్యంలో నాయుడుపంపు సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.2లక్షల 38 వేల 750 నగదును పోలీసులు సీజ్ చేశారు. ఓబుల రాంరెడ్డి బొలెరో వాహనంలో వరంగల్ నుంచి ఖమ్మం వెళ్తుండగా నగదును గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నగదు, వాహనంతోపాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు మామునూరు పోలీసులు తెలిపారు.



నిందితుడిని, వాహనాన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

# అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యం

### *వాల్మీకి ఆలయంలో ఎమ్మెల్యే అరూరి పూజలు*

మడికొండ, అక్టోబర్ 28: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. గ్రేటర్ 64వ డివిజన్ మడికొండలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వాల్మీకి జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రంలోని వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



వాల్మీకి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

### జిమ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

మడికొండ చౌరస్తాలో లావుడ్య కార్తీక్ నూతనంగా ఏర్పాటు చేసిన మజిల్ మ్యాజిక్ జిమ్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. దేహదారుఢ్యాన్ని పెంపొందించుకునేందుకు జిమ్ సెంటర్లు దోహదపడతాయని చెప్పారు.

### మృతుల కుటుంబాలకు పరామర్శ

గ్రేటర్ 64వ డివిజన్‌లో ఇటీవల మృతిచెందిన పలువురు కుటుంబాలను ఎమ్మెల్యే అరూరి పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త న్యాత శ్రీనివాస్, బోగి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం తెలియజేసి ఆర్థికసాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు ఆవాల రాధికరెడ్డి, మునిగాల సరోజన, నాయకులు పాల్గొన్నారు.

## ఆలయ నిబంధనలు అతిక్రమించిన కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట, అక్టోబర్ 28 : సుప్రసిద్ధ రాజరాజేశ్వరాలయ నిబంధనలను కాంగ్రెస్ నాయకులు అతిక్రమించారు. వర్ధన్నపేట సమీపంలోని ఆకేరువాగు ఒడ్డున ఉన్న ఇల్లంద రాజరాజేశ్వరాలయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాగరాజు, నాయకులు శనివారం అర్చనలు చేశారు. గర్భాలయంలోకి పురుషులు ఎవరైనా చొక్కాలు విప్పి వెళ్లి పూజలు చేయాల్సి ఉంటుంది. కానీ కాంగ్రెస్ నాయకులు హడావుడిగా గర్భాలయంలోకి వెళ్లడంతో అర్చకుడు పూజలు నిర్వహించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో చర్చనీయాంశమైంది.



రాజరాజేశ్వరాలయంలో చొక్కాలతోనే పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## నన్నపునేని పరామర్శ

ఖిలావరంగల్, అక్టోబర్ 28: ఖిలావరంగల్ పడమరకోట మున్నూరుకాపు వీధికి చెందిన ఇనుముల సురేశ్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శనివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ బైరబోయిన ఉమ, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్ ఉన్నారు.



సురేశ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నన్నపునేని

## జాతీయ యోగా పోటీలకు ఎంపిక

మడికొండ, అక్టోబర్ 28 : మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల 9వ తరగతి విద్యార్థి కే ఆనంద్ జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ ఖుర్షీద్ తెలిపారు. కరీంనగర్‌లోని మానేరు పాఠశాలలో ఇటీవల జరిగిన 10వ రాష్ట్ర స్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నట్లు చెప్పారు. గౌహతిలో నవంబర్ 23 నుంచి 26 వరకు జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆనంద్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఆనంద్‌ను వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి, పీడీ రమేశ్, పీటీ నిరంజన్, ఉపాధ్యాయులు యాదగిరి, సదానందం, రాజు, అనిత, రాజు, సురేశ్ కుమార్ అభినందించారు.

## గుర్తుతెలియని వృద్ధుడి మృతి

గిర్మాజీపేట, అక్టోబర్ 28: ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్వేస్టేషన్ వద్ద ఉన్న రేకుల షెడ్‌లో సుమారు 70 ఏండ్ల వయస్సు గల గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందినట్లు సీఐ ఎం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడు చామనఛాయ రంగులో ఉండి, పొట్టపై పుట్టు మచ్చ ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

## అపార్ కార్డుకు తల్లిదండ్రుల అంగీకారం

నడికూడ, అక్టోబర్ 28: మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఎస్ఏ-1 పరీక్షల ఫలితాలు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అపార్ గుర్తింపు కార్డుపై చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో కేజీ టు పీజీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ఆధార్ కార్డు మాదిరిగానే 17అంకెల అపార్ కార్డు (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ రిజిస్ట్రేషన్ నంబర్) ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్డు విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకి మారినప్పుడు, వేరే రాష్ట్రాల్లో పైచదువులకు వెళ్లినప్పుడు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు అపార్ అంగీకార పత్రాన్ని హెచ్ఎంకు అందజేశారు. హెచ్ఎం అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు విజేందర్, నిగ్గుల శ్రీదేవి, ఎస్ఎంసీ చైర్మన్ అమ్మ హారిక, విద్యా వలంటీర్లు పర్వవేణి జ్యోతి, బాబురావు, అంగన్‌వాడీ టీచర్ భీముడి లక్ష్మి, సంధ్య, ఐఆర్ఈపీ రమేశ్ పాల్గొన్నారు.



చర్లపల్లి పాఠశాలలో అపార్ పత్రాన్ని హెచ్ఎం సుదర్శన్‌కు అందజేస్తున్న తల్లిదండ్రులు



పిరమిడ్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

పర్వతగిరి, అక్టోబర్ 28 : మండలంలోని కల్లెడ ఆర్డీఎఫ్ పాఠశాల విద్యార్థులకు శనివారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. పట్టణాలకు దీటుగా ఆర్డీఎఫ్‌ను తీర్చిదిద్దడం అభినందనీమని హైదరాబాద్‌కు చెందిన కార్డియాలజిస్ట్ శ్రీమన్నారాయణ చెప్పారు. కంప్యూటర్ సైన్స్‌లో పీ ఫణి, స్పేస్ టెక్నాలజీ కెరీర్ గైడెన్స్‌పై శ్రీలేఖ పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అశోకాచారి, హెచ్ఎం శ్రీనివాస్, అసిస్టెంట్ హెచ్ఎం జీ మహేందర్, రాజు పాల్గొన్నారు.



కెరీర్ గైడెన్స్‌ను పరిశీలిస్తున్న శ్రీమన్నారాయణ బృందం